ప్రజల వద్దకు పాలన

జెండా వందనం చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌస్ ఆలం తదితరులు



ప్రభుత్వ కార్యాలయాల్లో గణతంత్ర వేడుకలు



జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న జిల్లా జడ్జి వరప్రసాద్

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో గణతంత్ర వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి అధికారులు నివాళులర్పించారు. జాతీయ పతాకానికి గౌరవ వందనం చేశారు. అంబేద్కర్ వంటి మహనీయుల సేవలను స్మరించుకున్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా జడ్జి సీహెచ్.వీఆర్ఆర్. వరప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్జీలు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవీ త్రివర్ణ పతకాన్ని ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, ఏఓ అరవింద్ కుమార్, డీసీవో మోహన్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ రాహుల్ రాజ్ మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. జిల్లా పోలీస్, ఎస్పీ క్యాంపు కార్యాలయాల్లో ఎస్పీ గౌస్ ఆలం జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ సీఈవో వి.గణ పతి, జిల్లా అటవీశాఖ కార్యాలయంలో డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు, ఆర్అండ్‌బీ శాఖ కార్యాలయంలో ఈఈ నర్సయ్య, డీఆర్డీఏ లో ఏపీడీ రవీందర్, జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీపీవో శ్రీనివాస్, విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో ప్రణీత, వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ రాథోడ్ నరేందర్, మత్స్యశాఖ కార్యాలయంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కిషన్, ఐసీడీఎస్‌లో జిల్లా సంక్షేమాధికారి మిల్కా, మైనార్టీ సంక్షేమశాఖలో డీఎండబ్ల్యూఓ రాథోడ్ రమేశ్, సంక్షేమ శాఖల సముదాయంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్ మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

- ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం
- ఆర్టీసీలో 11.54 లక్షల మంది మహిళల ఉచిత ప్రయాణం
- 'ఆరోగ్యశ్రీ'ని రూ.10లక్షలకు పెంచి అమలు
- 'అభయహస్తం' దరఖాస్తుల కంప్యూటరీకరణ పూర్తి
- రాబోయే రోజుల్లో మిగతా గ్యారంటీలు
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ రాహుల్‌రాజ్

సాక్షి,ఆదిలాబాద్: నూతన ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే అభయహస్తం ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టి ప్రజలకు చేరువగా పాలన అందించేందుకు ప్రభుత్వం ముందడుగు వేసిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ తొలుత జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆడబిడ్డలను మహాలక్ష్ములను చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని గతేడాది డిసెంబర్ 9న ప్రారంభించినట్లు చెప్పారు. జిల్లాలో 72 పల్లె వెలుగు, 30 ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అమలు చేశామన్నారు. ఇప్పటి వరకు 11లక్షల 54 వేల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని వివరించారు. అలాగే పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచి అమలుపరుస్తున్నామని తెలిపారు.

త్వరలో మిగతా గ్యారంటీలు..

రాబోయే రోజుల్లో అభయహస్తం పథకంలోని మిగతా గ్యారంటీలను కూడా అమలు చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. అర్హులైన మహిళలకు రూ.2500 ఆర్థికసాయం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ సరఫరా, రైతు భరోసా పథకం ద్వారా ఏడాదికి రైతులు, అర్హులైన కౌలు రైతులకు ఎకరాకు రూ.15వేలు అందించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేలు, గృహ జ్యోతి పథకం కింద అర్హులైన ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. అలాగే తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. చేయూత పథకం ద్వారా వయోవృద్ధులు, వితంతువులు, చేనేత కార్మికులు, డయాలసిస్, ఎయిడ్స్, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, బీడీ టేకేదారులకు రూ.4వేల చొప్పున పింఛన్ అందించనున్నట్లు చెప్పారు. అలాగే దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతుందన్నారు.

దరఖాస్తుల కంప్యూటరీకరణ..

జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి 2లక్షల 30వేల దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు. ప్రభుత్వ పరిశీలన కోసం వాటి కంప్యూటరీకరణ సైతం పూర్తి చేసినట్లు తెలిపారు. రైతులు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు, యువత, అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులు, ఉద్యోగులు, కార్మికులు, చేతివృత్తిదారులు, అన్నివర్గాలను పరిగణలోకి తీసుకొని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలుపర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యంగా రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వినూత్న పథకాలను ప్రవేశపెట్టే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు.

జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి..

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి అన్నిరంగాల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎంపీ సోయం బాపూరావు, జెడ్పీ చైర్మన్ జనార్దన్, శాసన సభ్యులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి పాటుపడుతున్నట్లు వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న న్యాయ, పోలీసు యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. కలెక్టర్‌తో పాటు ఎస్పీ గౌస్ ఆలం, డీఎఫ్‌వో ప్రశాంతి బాజిరావు పాటిల్ వేదికపై ఆసీనులయ్యారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కాగా గణతంత్ర వేడుకల్లో భాగంగా కలెక్టర్ ప్రసంగం అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత ఉత్తమ ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు ప్రశంస పత్రాలు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ సందర్శించారు.



జాతీయజెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, పక్కన అదనపు కలెక్టర్, ఎస్పీ, తదితరులు



నృత్య ప్రదర్శనలో విద్యార్థిని



నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు



జాతీయ జెండాలు చేతబూని విద్యార్థుల విన్యాసాలు



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



డీఆర్డీఏ శకట ప్రదర్శన..



పరేడ్‌లో పాల్గొన్న పోలీసులు

న్యూస్‌రీల్

బహుజనులంతా ఏకం కావాలి



మాట్లాడుతున్న గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: బహుజనులంతా ఏకతాటిపైకి రావాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం భారత రాజ్యాంగ రథయాత్ర నిర్వహించారు. పట్టణంలో పలు వీధుల గుండా సాగిన ర్యాలీ అంబేద్కర్ చౌక్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల కోసం ధర్మ సమాజ పార్టీ నిత్యం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజీవ్, అశోక్, ఓమన్న, సంతోష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు ప్రశంసపత్రం అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఎదులాపురం: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు నచ్చిన రంగాన్ని ఎంపిక చేసుకుని ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం వారికి కలెక్టర్ ప్రశంస పత్రాలు అందించారు.



నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

మళ్లీ చలి

- పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- ఇబ్బందులు పడుతున్న జనం
- అత్యల్పంగా అర్లి(టి)లో 8.6 డిగ్రీలు

జిల్లాలో వారం రోజులుగా నమోదైన కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లో)

తేదీ	కనిష్ట	గరిష్ట
20న	18.2	30.8
21న	19.7	32.3
22న	17.0	30.3
23న	18.7	29.3
24న	19.0	30.8
25న	9.5	28.0
26న	8.6	28.2



అర్లి(టి)లో చలిమంట కాగుతున్న జనం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో చలి మళ్లీ మొదలైంది. రెండు, మూడు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. వారం క్రితం 15 డిగ్రీల సెల్సియస్ వరకు ఉండగా ప్రస్తుతం 10 డిగ్రీలలోపే నమోదవుతున్నాయి. జిల్లాలో అత్యల్పంగా భీంపూర్ మండలం అర్లి(టి)లో 8.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చలి కారణంగా ఉదయం, సాయంత్రం వేళల్లో జనం ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు రక్షణ కవచాలు ధరిస్తున్నారు. చలి తీవ్రత కారణంగా వేకువజామున పాల వ్యాపారులు, పేపర్‌బాయ్‌లు, పారిశుధ్య కార్మికులు వణికిపోతున్నారు. ఏజెన్సీ, అటవీ ప్రాంతాల్లో చలి ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఉపశమనం కోసం గిరిజనులు చలిమంటలు కాగుతున్నారు.

జిల్లాలో భిన్న వాతావరణం..

జిల్లాలో భిన్న వాతావరణం ఉంటుంది. వర్షాకాలంలో అధిక వర్షాలతో పాటు వేసవిలో మండుటెండలు, శీతాకాలంలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. గతేడాది ఇదే సమయానికి కనిష్ట ఉష్ణోగ్రతలు 3.9 డిగ్రీలకు పడిపోయిన విషయం తెలిసిందే. చలి తీవ్రత అధికంగా ఉండడంతో వృద్ధులు, చిన్నారుల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం బేలలో 9.5, బజార్‌హత్నూర్‌లో 10, ఆదిలాబాద్ రూరల్ పిప్పల్‌ధరిలో 10.4, తాంసి, బోథ్‌లో 10.7, జైనథ్‌లో 10.9, తలమడుగులో 11.2, ఇంద్రవెల్లిలో 11.5, సిరికొండలో 12.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

క్లుప్తంగా

అయోధ్యకు సైకిల్‌యాత్ర



సైకిల్ యాత్రికులను సన్మానిస్తున్న దృశ్యం

భైంసా: అయోధ్యలో శ్రీరాములోరి దర్శనానికి సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులను భైంసా పట్టణవాసులు సన్మానించారు. జహీరాబాద్‌కు చెందిన సిద్దేశ్ గురువారం సైకిల్‌పై బయలుదేరి భైంసా చేరుకున్నాడు. సిద్దేశ్ స్నేహితుడైన రాజు సైకిల్‌యాత్రతో అయోధ్యకు వెళ్తున్నాడు. కుభీర్ మండలం అంతర్ని గ్రామానికి చెందిన రాజు భైంసాకు చేరుకున్నాడు. సైకిల్‌పై అయోధ్యకు వెళ్తున్న ఇద్దరు యువకులను భైంసా పట్టణ వాసులు సన్మానించారు. పులేనగర్‌లోని హనుమాన్ మందిరంలో ఘనంగా స్వాగతించారు. సైకిల్‌యాత్రతో వెళ్తున్న ఇద్దరు యువకులకు భైంసా పట్టణానికి చెందిన పలువురు యువకులు శాలువాలతో సత్కరించారు.

యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై ముజాహిద్ వివరాల ప్రకారం... ఇందిరమ్మ కాలనీ సమీపంలోని సేవాదాస్ నగర్‌కు చెందిన హేరకుమ్ర సాయిపృథ్వీ (24) తన సోదరుడితో నివాసం ఉంటున్నారు. తల్లి తిర్యాణిలో టీచర్‌గా ఉద్యోగం చేస్తోంది. సాయిపృథ్వీ గతంలో ఉక్రెయిన్‌లో ఎంబీబీఎస్ అడ్మిషన్ పొందాడు. అప్పట్లో అక్కడ యుద్ధం కారణంగా ఇంటికి తిరిగి వచ్చాడు. ఎంబీబీఎస్‌లో సీటు రాకపోవడంతో బీఎస్సీలో ఆడ్మిషన్ తీసుకున్నాడు. అప్పటి నుంచి మనోవేదనకు గురవుతున్న ఆయన ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకున్నాడు. తల్లి ఫోన్ చేయగా సమాధానం ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చి పక్కింటివారికి విషయాన్ని తెలిపింది. దీంతో వారు వెళ్లి కిటికిలోంచి చూసేసరికి ఉరేసుకుని కనిపించాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఎదులాపురం: రోడ్డు ప్రమాదంలో యువకుడు గురువారం రాత్రి మృతిచెందినట్లు టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... మహారాష్ట్ర నాందేడ్ జిల్లా మాహూర్ తాలుకా అసోలి గ్రామానికి చెందిన రాథోడ్ అమిత్ (22), రాథోడ్ గణేశ్‌లు అదే గ్రామానికి చెందిన రాథోడ్ ప్రఫుల్ ఆటోలో తాంసి మండలం బండల్ నాగపూర్ గ్రామానికి గురువారం రాత్రి సరుకుల కోసం వచ్చారు. సరుకులు తీసుకుని రాత్రి 11గంటల ప్రాంతంలో బండల్‌నాగపూర్ నుంచి అసోలికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ప్రఫుల్ అతివేగం, అజాగ్రత్త కారణంగా మార్గమధ్యలో జమునానగర్ ప్రాంతంలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అమిత్ తలకు, ముఖానికి తీవ్ర గాయాలు కావడంతో మాండ్వి ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి అదే రాత్రి ఒంటి గంట ప్రాంతంలో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

ఎదులాపురం: ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన తోక ఊశన్న (35) కనిపించడం లేదని టూ టౌన్ ఎస్సై జీవీ రమణారెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం .. తోక ఊశన్న ఈనెల 19న పనికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఇంత వరకు తిరిగి రాకపోవడంతో.. కొడుకును వెతికి పెట్టాలని కోరుతూ ఊశన్న తల్లి తోక లసుందేవి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్



కె. పార్థసారథి, ఉమ్మడి జిల్లా క్రీడల అధికారి, ఆదిలాబాద్



జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్



కె. నలంద ప్రియా, ఎన్నికల విభాగం కలెక్టరేట్ పర్యవేక్షకురాలు



సీహెచ్. దివాకర్, రెవెన్యూ ఆఫీసర్, ఆదిలాబాద్ మున్సిపల్

ఉత్తమ ఉద్యోగులు వీరే..

కైలాస్‌నగర్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా యంత్రాంగం తగు గుర్తింపునిచ్చింది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్‌పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ గౌస్ ఆలం, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్‌లతో కలిసి వారికి ప్రశంసా పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు.



ఎల్.శ్రీకాంత్, ఎస్సై, సిరికొండ | గంగారెడ్డి, కానిస్టేబుల్, బజార్‌హత్నూర్ | పి.వామన్‌రావు, జూనియర్ అసిస్టెంట్, సమాచారశాఖ | డా.ఎస్‌పి.వంజరీ, అనాటమీ హెచ్ఓడీ, రిమ్స్ | బి.మేర్సీ, అధ్యాపకురాలు, రిమ్స్ నర్సింగ్ కళాశాల

రాష్ట్రస్థాయి పురస్కారం



ఆదిలాబాద్‌టౌన్: జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ యూని ట్‌లో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులకు రాష్ట్రస్థాయి పురస్కారం దక్కింది. శుక్రవారం హైదరాబాద్‌లోని కుటుంబ సంక్షేమశాఖ రాష్ట్ర కార్యాలయంలో ఎంఈ ఎం.సతీష్, అకౌంటెంట్ రాజశేఖర్, ఐసీటీసీ కౌన్సెలర్ మెహరాజ్ అలీలకు రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ హైమావతి పురస్కారం అందించారు.



సిహెచ్.చిన్నయ్య, హెచ్‌డబ్ల్యువో, బోథ్ | కె.శివాజీ, జూనియర్ అసిస్టెంట్, డీపీహెచ్‌వో | బి.లక్ష్మి, కుక్, ఇంటిగ్రేటెడ్ హాస్టల్, ఆదిలాబాద్ | ఇక్బాల్ అహ్మద్, సీనియర్ అసిస్టెంట్, డీవైఎస్‌వో | జె.ప్రవీణ్, ఆఫీస్ సబార్డినేట్, డీఆర్‌డీఏ | అనిల్‌కుమార్, ఆపరేటర్, ఆదిలాబాద్ ఫైర్‌స్టేషన్ | ఇఫ్పత్ ఉస్ సబ్లాన్, ఝరీ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ | ఎల్.దీపక్, ఈఎంటీ, ఆదిలాబాద్ | యు.శివనాగప్రతాప్, ఏఈ, మిషన్ భగీరథ | పి.నాగరావు, జూనియర్ అధ్యాపకుడు, ఆదిలాబాద్ | ఎ.ఉమా, హెడ్‌నర్సు, రిమ్స్ ఆసుపత్రి



బి.గణేష్, ఎఫ్ఆర్ఓ, సిరిచెల్మ | టి.ప్రణయ్, ఎఫ్ఆర్‌వో, బోథ్ | డి.సాయినాథ్, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ | మహ్మద్ తౌసిఫ్, ఏఈఓ, జైనథ్ | ఏ.జగదీష్, ఎఫ్ఎస్‌టీ, బోథ్ | శ్రీనివాస్, ఎంపీడీవో, భీంపూర్ | జి.ప్రేంనివాస్, ఎస్ఎస్‌టీ, ఆదిలాబాద్ | వి.సునీత, బీఎల్ఓ, బోథ్ | అత్తావుల్లాఖాన్, హెడ్ కానిస్టేబుల్, డీసీఆర్‌బీ | కుషివర్త, బీఎల్‌వో, ఇంద్రవెల్లి | బి.శిరీష, బీఎల్‌వో, ఆదిలాబాద్



పి.శరత్‌చంద్ర, కానిస్టేబుల్, రూరల్‌పీఎస్ | జే.గణేష్, హోంగార్డు, ఆదిలాబాద్. | పి.పురుషోత్తం, ఏఆర్ కానిస్టేబుల్, ఆదిలాబాద్ | జి.శ్రీను, కానిస్టేబుల్, స్పెషల్ బ్రాంచ్ | ఎం.శ్రీనివాస్, కానిస్టేబుల్, మహిళ పోలీస్‌స్టేషన్ | ఎల్.జైపాల్, ఎంపీహెచ్‌డబ్ల్యువో, బేల | పి.రాకేష్, ఎంపీహెచ్ డబ్ల్యువో, యాపల్‌గూడ | ఎస్.సునీల్, పంచాయతీ సెక్రటరీ, బజార్‌హత్నూర్ | భీంరావు, ఆయుష్ డిపార్టుమెంట్, రిమ్స్ | గిత్తే మదన్, సామాజిక కార్యకర్త, గుడిహత్నూర్ | బి.రాజేశ్వర్, సీనియర్ అసిస్టెంట్, జెడీసీ



కె.రాహుల్, కామన్ సర్వీస్ సెంటర్ జిల్లా మేనేజర్ | పొచ్చన్న, ఆఫీస్ సబార్డినేట్, డీఈవో కార్యాలయం | శ్రీనివాస్‌గౌడ్, జూనియర్ అసిస్టెంట్, డీపీవో | డి.భూమరాజు, ఆఫీస్ సబార్డినేట్, మత్స్యశాఖ | ఎస్.మురళీధర్, సూపరింటెండెంట్, ఇరిగేషన్ | అబ్దుల్ కలీం, డీపీఓ, మైనార్టీ కార్యాలయం | ఎం.సాయిచరణ్, ఏఎంవీఐ, భోరజ్ చెక్ పోస్ట్ | శ్రీకాంత్, స్మైల్‌సొసైటీ అధ్యక్షుడు, ఆదిలాబాద్ | నాగమ్మ, అంగన్‌వాడీ టీచర్, కోలాంగూడ, బోథ్ | వెంకటమ్మ, అంగన్‌వాడీ టీచర్, తలమడుగు | అంకిత్ జాదవ్, ఎస్‌బీఐ బ్రాంచ్‌మేనేజర్, ఇచ్చోడ

ట్రిపుల్‌ఐటీలో గణతంత్ర వేడుకలు



ట్రిపుల్‌ఐటీలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న విద్యార్థులు



జెండా ఎగురవేస్తున్న వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో శుక్రవారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. శాతవాహన గ్రౌండ్‌లో వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనం ద్వారా నిర్మితమైన మన విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు పూర్తిస్థాయిలో కృషిచేస్తున్నామన్నారు. గడిచిన ఏడాదిన్నర కాలంలో రూ. 100 కోట్ల మేర ఖర్చు పెట్టామని, రానున్న విద్యాసంవత్సరానికి కావాలిసిన వాటి కోసం ప్రణాళిక వేస్తున్నామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూనే ఉపాధి అవకాశాల్లో నైపుణ్యాలు సాధించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అధ్యాపకులు ఉద్యోగుల సమన్వయంతో ట్రిపుల్‌ఐటీని అగ్రభాగన నిలిపేందుకు కృషిచేస్తామన్నారు. అంతకుముందు ఆర్జీయూకేటీ ఎన్‌సీసీ వలంటీర్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థులు చేసిన కవాతు అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి నిరంతర కృషి

- ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా
- ఐటీడీఏలో ఘనంగా గణతంత్ర వేడుకలు



నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధీనంలోని గిరిజన ప్రాంతాల సంపూర్ణ అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా కృషి చేస్తున్నామని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బు గుప్తా అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం ఐటీడీఏ ప్రాంగణంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయిలతో కలిసి జెండా ఎగురవేశారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ విద్యాభివృద్ధికి 917 ప్రాథమిక పాఠశాలల్లో 12,945 విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, 681 ఉపాధ్యాయులు పనిస్తున్నారన్నారు. 133 ఆశ్రమ పాఠశాలల్లో 34,658 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. 13,656 విద్యార్థులకు రూ.1134.96 లక్షలు పోస్టుమెట్రిక్ స్కాలర్ షిప్, 553 విద్యార్థులకు రూ.8.45 లక్షలు ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ మంజూరు చేసినట్లు తెలిపారు. 72 పీవీటీజీ గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనా, మోడల్ పాఠశాలలుగా రూపకల్పన చేయడం జరిగిందన్నారు. క్రీడల్లో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే విధంగా కావాలిసిన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. 59 నెలల తీవ్ర పోషణ లోపం ఉన్న పిల్లల ఆరోగ్యం మెరుగుపర్చడం కోసం బాలామృతం పంపిణీ చేసేందుకు కొమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలలో పైలెట్ ప్రాజెక్ట్ ప్రారంభించినట్లు తెలిపారు. వైద్యం కోసం అదనపు జిల్లా, ఆరోగ్య శాఖాధికారి పరిధిలో 32ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 186 ఉప ఆరోగ్య కేంద్రాలు, ఆరు సామాజిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. ఐటీడీఏ ఉట్నూర్ పరిధిలో 23 మండలాల్లో 24 పీహెచ్‌సీలలో అవ్వల్ అంబులెన్స్‌ల ద్వారా 31523 మంది గర్భవతులకు సురక్షిత ప్రసవం చేయడం జరిగిందన్నారు. ఆర్థిక సహాయం కింద ఉమ్మడి జిల్లాకు రూ. 44.67 కోట్ల సబ్సిడీతో 5644 యూనిట్లు మంజూరు చేశామని, 4378 మంది లబ్ధిదారుల ఎంపిక పూర్తియిందన్నారు. 2160 మందికి సబ్సిడీ కింద రూ.20.25 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగం ద్వారా మౌలిక సదుపాయాల కోసం 423 తారురోడ్ల నిర్మాణాలకు రూ.52161 లక్షల అంచనాలతో మంజూరైన కొన్ని పనులు పురోగతిలో ఉన్నాయని, అందుకు రూ.462.14 లక్షలు ఖర్చు అయ్యాయని మిగిలిన ప్రారంభించడం జరుగుతుందన్నారు. పర్యటకం కోసం కుంటాల జలపాం, సప్తగుండాల జలపాతం, ఉట్నూర్ కోటలో ఈకో టూరిజం ప్రాజెక్టు క్రింద రూ.900 లక్షలతో పనులు మంజూరైనట్లు తెలిపారు. గిరిజన సహకార సంస్థ, ఐటీడీఏ ఉట్నూర్ ఆధ్వర్యంలో 17 పెట్రోల్ పంపులు ఏర్పాటు కోసం ప్రతిపాదనలు రూపొందించామని, 9 పెట్రోల్ పంపులు ఏర్పాటు చేసి నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కల్పించామని తెలిపారు. అంతకు ముందు విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. 87మంది ఉత్తమ ఉద్యోగులకు, ఐదు పాఠశాలలకు ప్రశంస పత్రాలు అందచేశారు. డీడీ దిలీప్‌కుమార్, ఏవో రాంబాబు, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో బాలు, బీఏడ్ ప్రిన్సిపాల్ మనోహర్, ఈఈ భీంరావు పాల్గొన్నారు.

వలస కార్మికుల సమస్యలపై అధ్యయనం..



దుబాయ్‌లోని కార్మిక సంఘ నాయకులతో బృందం సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవాసీ విధానం (ఎన్నారై పాలసీ), గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడానికి, గల్ఫ్ దేశాల్లో వలస కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై అధ్యయనం చేయడానికి రాష్ట్రం నుంచి కార్మిక సంఘాల నాయకులు, కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ విభాగం నాయకులతో కూడిన బృందం శుక్రవారం యూఏఈ పర్యటనకు బయలుదేరి వెళ్లింది. శని, ఆదివారాల్లో రాష్ట్రం నుంచి వెళ్లిన గల్ఫ్ కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకోనున్నారు. బృందంలో నిర్మల్ జిల్లాకు చెందిన ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల, సారంగాపూర్ మండల జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, టీపీసీసీ ఎన్ఆర్ఐ విభాగం చైర్మన్ బి.ఎం. వినోద్ కుమార్, గల్ఫ్ ఎన్నారై సెల్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి జెలాల సైదయ్య బాబు ఉన్నారు. వీరితోపాటు ఏమిగ్రెంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు, వలస కార్మికుల సమస్యల విశ్లేషకులు మంద భీమ్‌రెడ్డి కూడా పాల్గొననున్నారు. దుబాయ్, షార్జా, అబుదాబి, బార్ దుబాయ్ తదితర ప్రాంతాల్లోని వలస కార్మికుల క్యాంపుల్లో బసచేసి, వారి సమస్యలను తెలుసుకుని నివేదిక తయారు చేయనున్నారు. గత శాసనసభ ఎన్నికలకు ముందు ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ గల్ఫ్ కార్మిక సంక్షేమం కోసం ఎన్నారై పాలసీని రూపొందించనున్నట్లు హామీ ఇచ్చిన నేపథ్యంలో ఈ పర్యటన కొనసాగుతుందని స్వదేశ్ పరికిపండ్ల తెలిపారు.

ఐడియా అదిరింది..



లక్ష్మణచాంద మండలంలో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. ఒకేసారి అటు వరినాట్లు... ఇటు పసుపు తవ్వకం పనులు కొనసాగుతున్నాయి. దీంతో మండలంలోని పీచర గ్రామానికి చెందిన భూమేశ్ తన పొలంలో వరినాటు కోసం కూలీలను పీచర గ్రామం నుంచి పొలం వరకు తన ట్రాక్టర్‌కు వెనుక ఎడ్ల బండిని తగిలించి అందులో కూలీలను తీసుకొచ్చాడు. దీనిని చూసిన పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

– లక్ష్మణచాంద